క్లుప్తంగా

'సిద్ధం' సభకు స్వచ్ఛందంగా తరలివెళ్లిన కార్యకర్తలు



ముదినేపల్లి రూరల్: బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సిద్ధం సభకు మండలంలోని పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలివెళ్లాయి. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో చిగురుకోట, నరసన్నపాలెం, చినకామనపూడి, గురజ గ్రామాలకు చెందిన పార్టీ యువత సొంత వాహనాల్లో తరలివెళ్లారు.

ఘనంగా రామేశ్వరుని రథోత్సవం



తోట్లవల్లూరు: మండలంలోని ఐలూరులో రామేశ్వరస్వామి రథోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక శ్రీగంగా పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణం వైభవం జరిగిన విషయం విదితమే. ఆలయ ఈఓ జయశ్రీ, సిబ్బంది కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రావులకొల్లుకు సత్కారం



గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం గౌరవాధ్యక్షుడిగా నియమితులైన రావులకొల్లు మల్లేశ్వరరావును బీసీ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. శ్రీరామ్‌పురంలోని ఆయన నివాసంలో బీసీ సంఘం అధ్యక్షుడు దారం నరసింహారావు ఆధ్వర్యంలో ఈ సత్కారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.ఆదివిష్ణు, జిల్లా ఉపాధ్యక్షుడు డి.వెంకట కృష్ణారావు, బండారు రాధాకృష్ణ, నెరుసు శ్రీనివాసరావు, బి సోమశేఖర్, టి రాధ పాల్గొన్నారు.

నాగేశ్వరస్వామి వసంతోత్సవం



పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ ఏసీ చక్రధరావు ఆధ్వర్యాన ఆదివారం ఉదయం 8 గంటలకు నిత్య బలిహరణ, 10 గంటలకు చూర్ణోత్సవం, అవబృథోత్సవం, త్రిశూల స్నానం, వసంతోత్సవం జరిగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేదపండితులతో పూర్ణాహుతి జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు రాజాధిరాజ వాహనంపై శ్రీ స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు నిత్య బలిహరణ, 9 గంటలకు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం పారువేట, శమీవృక్ష పూజ వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

పెదన: మండలంలోని బల్లిపర్రులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం ఐదో తరగతికి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని చీఫ్ సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రూతమ్మ తెలిపారు. ఉదయం ఐదో తరగతి వారికి 119 మందికి 58 మంది హాజరయ్యారని, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి మధ్యాహ్నం నుంచి నిర్వహించిన పరీక్షకు 162 మందికి 156 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. పామర్రు గురుకుల పాఠశాల సోషల్ పీజీటీ పి.చంద్రపాల్ పర్యవేక్షకుడిగా వ్యవహరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పమిడిముక్కల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లకు ఎస్ఐ శ్రీనివాస్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ నేరప్రవృత్తిని మాని మంచి నడవడికతో మెలగాలన్నారు. అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనకూడదని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గొడవలు, నేరాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్


పెదమద్దాలిలో పీఏసీఎస్ గోదాము శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పెదమద్దాలి(పామర్రు): రైతుల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని పెదమద్దాలి గ్రామంలోని పీఏసీఎస్‌లో నిర్మించిన గోదామును పీఏసీఎస్ అధ్యక్షుడు సుంకర శిరీష తదితర నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు బాగుంటే దేశం బాగుంటుందని నమ్మిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారి అభ్యున్నతికి ఎన్నో వినూత్న పథకాలను ప్రవేశ పెట్టి అమలు పరుస్తున్నారన్నారు. నాబార్డు నిధులు రూ.40లక్షలతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదామును ప్రారంభించామన్నారు. కుల, మత, ప్రాంత పార్టీ అని విభేదాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు స్వరూపరాణి, పీఏసీఎస్ డైరెక్టర్ల నత్తా బాలకృష్ణ, కొలుసు నరేషు, గ్రామ సర్పంచ్ బందెల జెర్సీ శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు రాజ్యలక్ష్మి, నాయకులు పాలడుగు రాంప్రసాద్, సుంకర శ్రీధర్, బందెల జయరాజు పాల్గొన్నారు.

మంచి చేశాం.. తలెత్తుకుని ఓట్లు అడుగుతున్నాం

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరికీ మంచి చేశాం కాబట్టే తలెత్తుకుని ఓట్లు అడుగుతున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. ప్రజాఆదరణ పొందుతున్న గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమం ఆదివారం నాటికి 9వ రోజుకు చేరింది. స్థానిక 8వ వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక మహిళ పంచాయతీ కుళాయిల నుంచి వచ్చే నీరు ఒక్కో సందర్భంలో మురికిగా వస్తోందని చెప్పగా సమస్య వెంటనే పరిష్కరించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. మరో మహిళ తాను నెల రోజుల క్రితం ఇంటి స్థలాలనికి దరఖాస్తు చేశానని చెప్పారు. దీంతో వలంటీరుతో ఆమె అర్హత ఆధారంగా పట్టాను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 12,000 ఇంటి పట్టాలను పంపిణీ చేస్తే ఒక్క కైకలూరు వైఎస్సార్ గ్రీన్ విలేజ్‌లో 3,172 ఇంటి పట్టాలను అందించామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ, జిల్లా ముస్లిం మైనారిటీ సెల్ కార్యదర్శి రఫీ, నాయకులు కొండరాజు, పాము రవి కుమార్, శ్యామలరావు, కాసులు, తోట మహేష్, అంజి, గాలిబ్‌బాబు, మోహనరావు, రమేష్, ఏసుకుమార్, నాగు, నారాయణ, సత్యనారాయణ, ఫిర్దోస్ ఖాన్, లాజరు, ముసలయ్య పాల్గొన్నారు.


గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

వైఎస్సార్ చేయూతతో మహిళాభివృద్ధి

ఎమ్మెల్యే డీఎన్నార్
ఎమ్మెల్సీ జయమంగళ


ఆటపాక హైస్కూల్ వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మహిళలు

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. ఆటపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చేయూత పథకం పొందిన మహిళలకు బ్యాంకు నమూనా చెక్కును ఆదివారం అందించారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 58 నెలల్లో వరుసగా నాలుగో ఏడాది వైఎస్సార్ చేయూత ద్వారా ఒక్కో ఏడాది రూ.18,750 నగదు చొప్పున నాలుగో ఏడాది కైకలూరు మండలంలో రూ.8,67,98,000 అందించామన్నారు. ఇప్పటివరకు కైకలూరు మండలంలో నాలుగు విడతల్లో రూ.3.7 కోట్లను నేరుగా ఎటువంటి దళారీ వ్యవస్థలు లేకుండా ఖాతాలకు చేరాయన్నారు. అనంతరం స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు, రేషన్ కార్డులను అందించారు. ఎమ్మెల్యే కుమారులు వినయ్, శ్యామ్ నిర్వాహణలో మహిళలందరికీ భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీ, ఏఎంసీ చైర్మన్లు చేబోయిన వీరరాజు, కొల్లాటి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భట్రాజు శివాజీ, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

నూతన రేషన్ కార్డుల పంపిణీ

ఆటపాక ప్రాజెక్ట్ నవయాన్ సంస్థ కృషితో మంజూరు చేసిన రేషన్ కార్డులను వలస వచ్చిన పలు ఎస్టీ కుటుంబాలకు ఎమ్మెల్యే డీఎన్నార్ అందించారు. వలస కుటుంబాలకు సాయపడుతున్న ప్రాజెక్ట్ నవయాన్ అధ్యక్షుడు వంగలపూడి విజయ్, వైస్ ప్రెసిడెంట్ పాలపర్తి రాకేష్, యూత్ అసోసియేషన్ సభ్యులు పిల్లనగ్రోవి జయంత్ తదితరులు పలువురిని ఎమ్మెల్యే డీఎన్నార్ అభినందించారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కొలువైయున్న స్వామిని భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి పుట్టలో పాలుపోసి దర్శించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద, గోకుళంలోని గోవులకు పసుపు,కుంకుమలతో మహిళలు పూజలు చేశారు. ఆలయ ఈఓ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

పామర్రు: జమాత్ ఇస్లామి హింద్(జేఐహెచ్) పామర్రు శాఖ ఆధ్వర్యంలో పేదలైన ముస్లింలకు నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. స్థానిక జేఐహెచ్ కార్యాలయంలో ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జేఐహెచ్ అధ్యక్షుడు యూనుస్ ఉమ్రి మాట్లాడుతూ రంజాన్ మాసంలో పేద వారు కూడా ఉపవాసాలు పాటించి దైవ ప్రసన్నత పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేఐహెచ్ సభ్యులు మున్వర్ పాషా, ఇబ్రహీం, రెహ్మాన్, షరీఫ్, ఆరిఫ్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

తోట్లవల్లూరు: పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ సోమవారం తోట్లవల్లూరు మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని వల్లూరుపాలెంలో జగనన్న కాలనీ నివేశన స్థలాల పరిశీలనతోపాటు చాగంటిపాడు, భద్రిరాజుపాలెం, తోట్లవల్లూరు, రొయ్యూరు, దేవరపల్లి, గురివిందపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని పేర్కొన్నారు. తోట్లవల్లూరు జెడ్పీ పాఠశాల్లో వైఎస్సార్ చేయూత, వలంటీర్ల వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

23న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీస్

మచిలీపట్నంటౌన్: ఫాల్గుణ పౌర్ణమికి భక్తుల సౌకర్యార్థం అరుణాచల గిరి ప్రదక్షిణకు మచిలీపట్నం నుంచి అరుణాచలానికి ఈ నెల 23వ తేదీన ప్రత్యేక బస్సు సర్వీస్‌ను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ టి.పెద్దిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ ధర రూ. 3 వేలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆ రోజు సాయంత్రం 5గంటలకు మచిలీపట్నం నుంచి ఈ సర్వీస్ బయలుదేరి రేపల్లె మీదుగా శ్రీకాళహస్తి, కాణిపాకం, అర్ధవీడు, సిరిపురం మీదుగా అరుణాచలానికి 24వ తేదీ చేరుతుందని తెలిపారు. ఆ రోజు దైవదర్శనం, అరుణాచల గిరి ప్రదక్షిణ చేసుకున్న అనంతరం కంచి, విష్ణుకంచి, కామాక్షి దేవాలయం, తిరుత్తణి ప్రాంతాలను దర్శించుకుంటారని పేర్కొన్నారు. 26వ తేదీన ఈ సర్వీస్ మచిలీపట్నం చేరుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 82475 29433 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి సంపటాలమ్మ ఆలయ వార్షికోత్సవం

చల్లపల్లి: గ్రామ దేవత శ్రీ సంపటాలమ్మ తల్లి ఆలయ 25వ వార్షిక మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమ పూజ, 12న కుంకుమ పూజ, 13న కుంకుమార్చన, అభిషేకాలు, అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళులు


నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు

గుడివాడ టౌన్: మహిళా విద్యాదాత సావిత్రీబాయి పూలే స్త్రీ సమాజానికే గర్వకారణమని ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు మెరుగుమాల శివరామకృష్ణ అన్నారు. ఆదివారం సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక మెయిన్ రోడ్‌లో గల జ్యోతిరావ్‌పూలే – సావిత్రీబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లాయన మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే 9 సంవత్సరాల వయస్సులోనే బాల్యవివాహం చేసుకుని భర్త ప్రోత్సాహంతో విద్యనభ్యసించి ఉపాధ్యాయినిగా స్త్రీ సమాజానికి విద్యనేర్పిన ఘనత సాధించిందదన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోనా రామారావు, కోశాధికారి కె.రామకృష్ణ, డిప్యూటీ గవర్నర్ అర్జా ప్రసాదు, జెడ్‌సీ పొన్నూరు సత్యనారాయణ, ప్రాజెక్ట్ సభ్యులు మున్నలూరి రామకృష్ణ, లింగం చిట్టిబాబు, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న దుక్కిపాటి శశిభూషణ్

నందివాడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాల్సిన బాధ్యత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, బూత్ కమిటీ సభ్యులపై ఉందని వైఎస్సార్ సీపీ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ పేర్కొన్నారు. మండలంలోని నందివాడలో ఉన్న కొండపల్లి కన్వెన్షన్ హాల్లో మేము సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుక్కిపాటి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కరోనా కారణంగా రెండు సంవత్సరాలు ప్రభుత్వానికి ఎటువంటి ఆదాయం లేకపోయినా అర్హులందరికీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏవిధంగా అమలు చేశారనే విషయాన్ని వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ని భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ఎంపీపీ పెయ్యల ఆదాం, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కొండపల్లి కుమార్‌రెడ్డి, గుడివాడ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, నాయకులు వల్లూరిపల్లి సుధాకర్, నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, గొల్లపూడి చంద్రశేఖర్, నాగేశ్వరరావు, రంగారెడ్డి, కృష్ణారెడ్డి, నాగు, చంద్రశేఖర్, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన శివరాత్రి వేడుకలు


భోగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అడవి వెంకటగంగాధర శర్మ దంపతులు

కలిదిండి: దక్షిణ కాశీగా పేర్గాంచిన కలిదిండి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన శివరాత్రి మహోత్సవాలు పూర్ణాహుతి కార్యక్రమాలతో ఆదివారం ముగిశాయి. ఆలయ వ్యవస్థాపక కుటుంబసభ్యులు అడవి వెంకట గంగాధరశర్మ అలివేలు దంపతులు పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రి మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించిన ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు దంపతులకు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు సత్కారం నిర్వహించారు. అలాగే మహాశివరాత్రి సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుల లెక్కింపును సోమవారం చేపడతామని ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

నీతివంతమైన పాలనకు నిదర్శనం సీఎం జగన్


ప్రజాఆశీర్వాద యాత్రలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: నీతివంత పాలనకు నిలువెత్తు నిదర్శనం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. వదర్లపాడు, నర్సాయిపాలెం గ్రామాల్లో ప్రజాఆశీర్వాద యాత్రను ఆదివారం నిర్వహించారు. భారీ బైక్ ర్యాలీతో యువత నాయకులకు స్వాగతం పలికారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. వదర్లపాడు గ్రామంలో రూ.50 లక్షలు విలువైన ఐదు సీసీ రోడ్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఎమ్మెల్యే, ఎంపీలను ఇరువురిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ కురేళ్ల బేబీ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, సర్పంచులు ఒడుగు లక్ష్మీనాగదేవి, రాధాకృష్ణ, ఎంపీటీసీ ఘంటసాల కనకరత్నం, నాయకులు ఏసుబాబు, సురేష్, ప్రసాదబాబు, పెరుగు వెంకన్న, చందు, నాగు, శ్రీను పాల్గొన్నారు.

సంస్కృత అధ్యయనం నిదర్శనం


మాట్లాడుతున్న అరుణశ్రీ


చిన్నారుల జానపద నృత్యం

గుడివాడ టౌన్: భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు సంస్కృత అధ్యయనం నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ బాలకేంద్ర ప్రముఖ్ ఉపద్రష్ట అరుణశ్రీ అన్నారు. ఆదివారం స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట బ్రాహ్మణ సత్రంలో కృష్ణాజిల్లా జానపద సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సంస్కృతం తప్పనిసరిగా నేర్చుకునే ప్రయత్నం చేయాలన్నారు. సంస్కృతం నేర్చుకోవడం వలన హిందీ, తెలుగు ఇతర భాష సైతం ఇట్టే అర్థం చేసుకోగలుగుతారన్నారు. మూల గ్రంథాలు కూడా తెలుసుకోగలరన్నారు. విద్యార్థులు సంస్కృతం అభ్యసనపై దృష్టిపెట్టాలన్నారు. అనంతరం చిన్నారులచే జానపద నృత్యాలు, గ్రూప్ సాంగ్స్, సంస్కృత కంఠోపాటాలు తదితర కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్కృత భారతి గుడివాడ అధ్యక్షుడు ఉపద్రష్ట రామస్వామి శాస్త్రి, కార్యదర్శి పోపూరి శ్యామ్‌సుందర్, సభ్యులు సూర్యకుమారి, విజయ, చింతా లక్ష్మి పాల్గొన్నారు.

పులిగడ్డ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు


పులిగడ్డ చెక్‌పోస్టు వద్ద డీఎస్పీ

అవనిగడ్డ: పులిగడ్డ అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద డీఎస్పీ మురళీధర్ ఆదివారం పలు వాహనాలను తనిఖీలు చేశారు. చెక్‌పోస్టును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయన తెలిపారు. డబ్బు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ ఆదేశాల మేరకు పెట్రోలింగ్

మండవల్లి: జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో, ఎస్ఐ రామచంద్రరావు, సిబ్బంది భైరవపట్నం, మణుగునూరు, అయ్యవారిరుద్రవరం, మండవల్లి గ్రామాల్లో ఆదివారం పుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. రూరల్ సీఐ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగా, భయం లేకుండా వినియోగించుకోవడానికి అన్ని రకాల చర్యలను తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా శాంతి, భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముస్లింలను విమర్శిస్తే ఓటుతో బుద్ధి చెబుతాం


విలేకరులతో మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

గుడివాడ టౌన్: ప్రజాస్వామ్యంలో ఎవరైనా, ఏ పార్టీలోకైనా మారే హక్కు ఉందని దాన్ని విస్మరించి పిచ్చి పిచ్చి విమర్శలు చేయడం టీడీపీ నాయకులకు తగదని ముస్లిం మైనార్టీ నాయకులు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. టీడీపీకి చెందిన మైనార్టీ నాయకుడు అబ్దుల్ ఖాసీం (ఆబూ) వైఎస్సార్ సీపీలో చేరిన నాటి నుంచి టీడీపీ నాయకుల వ్యక్తిగత విమర్శలు అధికమయ్యాయన్నారు. ఆబూ అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించేవాడని మాలో కొందరు అవినీతి సొమ్ముతో బుతుకుతున్నామని తదితర వ్యక్తిగత విమర్శలు ఘాటుగా చేస్తున్నారన్నారు. డబ్బులిచ్చి తమ సామాజిక వర్గానికి చెందిన ముస్లిం పెద్దలతో విమర్శలు చేయిస్తున్న టీడీపీ నాయకులు వాటిని మానుకోపోతే గట్టిగా బుద్ధి చెబుతామన్నారు. టీడీపీలోని ఓ చోటా నాయకుడు ఈ వ్యవహారాలు చేస్తున్నాడని తమ దగ్గర పూర్తి ఆధారాలున్నాయన్నారు. అందుకే తాము వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఈ విమర్శలపై దర్యాప్తు చేయాలని ఫిర్యాదు చేశామన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆబూ మాట్లాడుతూ తన ఫోన్ పోలీసులకు ఇస్తానని అదేవిధంగా టీడీపీలో కొనసాగుతున్న కొందరి వ్యక్తుల ఫోన్లు కూడా పోలీసులకు ఇస్తే ఎవరు అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నారో పోలీసులే తేల్చేస్తారన్నారు. అందుకు టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము, ఆయనకు భజన చేస్తున్న ముస్లిం నాయకులు సిద్ధమా అని ప్రశ్నించారు. ముస్లింలంతా ఎమ్మెల్యే కొడాలి నానీకి మద్దతు పలకడంతో టీడీపీ నాయకులకు చుక్కలు కనపడుతున్నాయన్నారు. ఈ భయంతోనే అసత్యపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు బాజీ, ఉపాధ్యక్షుడు అలీబేగ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సర్దార్‌బేగ్, గుల్జార్‌చౌక్ మజీద్ సెక్రటరి రజక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

అబ్దుల్ ఖాసీం(ఆబూ)పై టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలపై ఆదివారం ముస్లిం నాయకులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చైల్డ్‌హుడ్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు


పులిగడ్డలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ

అవనిగడ్డ: అవనిగడ్డ చైల్డ్‌హుడ్ గ్రూపు స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రెండుచోట్ల చలివేంద్రాలను ప్రారంభించారు. పులిగడ్డ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం డీఎస్పీ మురళీధర్ ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. అవనిగడ్డలో సంస్థ కార్యాలయస్థెదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ గంగాధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్, సేవాసంస్థ అధ్యక్షుడు మత్తి శ్రీనివాసరావు, సెక్రటరీ దివి లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.